80కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: భారత విమానయాన సంస్థలకు వస్తున్న నకిలీ బాంబు బెదిరింపులు ఆగటం లేదు. గురువారం ఒక్క రోజు 80కిపైగా దేశీయ, అంతర్జాతీయ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఎయిర్ ఇండియా, విస్తారా, ఇండిగోలలో ప్రతి సంస్థ నుంచి కనీసం 20 విమానాలకు, ఆకాశ ఎయిర్‌లైన్స్ 13 ఫ్లైట్స్‌కు, అలయన్స్ ఎయిర్, స్పైస్ జెట్ సంస్థలకు చెందిన 5 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చినట్టు సంబంధిత వర్గాలు ప్రకటించాయి. గత 11 రోజుల్లో సుమారు 250 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి.

పండుగల సీజన్‌లో స్విగ్గీ, జొమాటో ఝలక్

కొన్ని నగరాల్లో ప్లాట్‌ఫాం ఫీజు పెంపు

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు స్విగ్గీ, జొమాటో కొన్ని నగరాల్లో ప్లాట్‌ఫాం ఫీజును రూ.10కి పెంచేశాయి. దీనికి సంబంధించిన ఓ నివేదికపై స్పందిస్తూ జొమాటో గురువారం వివరణ ఇచ్చింది. తాము బుధవారం నుంచి ప్లాట్‌ఫాం ఫీజును పెంచామని చెప్పింది. ఇదంతా నిత్యం జరిగే వ్యాపారానికి సంబంధించిన అంశమని తెలిపింది. ఇటువంటి మార్పులు ఒక్కో నగరంలో ఒక్కొక్క విధంగా ఉంటాయని వివరించింది. ఈ కంపెనీ న్యూఢిల్లీలో వసూలు చేసే ఫెస్టివ్ సీజన్ ప్లాట్‌ఫాం ఫీజు రూ.10కి చేరింది.

బారామతిలో బాబాయ్Xఅబ్బాయ్

పుణే: మహారాష్ట్రలోని బారామతి శాసనసభ నియోజకవర్గంలో బాబాయ్, అబ్బాయి తలపడుతున్నారు. వచ్చే నెలలో జరిగే శాసన సభ ఎన్నికల కోసం 45 మంది అభ్యర్థులతో తొలి జాబితాను ఎన్‌సీపీ (ఎస్‌పీ) గురువారం విడుదల చేసింది. బారామతి నుంచి యుగేంద్ర పవార్ పోటీ చేస్తారని తెలిపింది. ఈ నియోజకవర్గం నుంచి ఉప ముఖ్యమంత్రి, ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్ పోటీ చేస్తున్నారు. అజిత్ తమ్ముడి కుమారుడే యుగేంద్ర. ఎన్‌సీపీ (ఎస్‌పీ) తొలి జాబితాలో టికెట్టు పొందినవారిలో ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జయంత్ పాటిల్, జితేంద్ర అవహద్, అనిల్ దేశ్‌ముఖ్, హర్షవర్ధన్ పాటిల్ ఉన్నారు.

వయసు నిర్ధారణకు ఆధార్ చెల్లదు

సుప్రీంకోర్టు తీర్పు

న్యూఢిల్లీ: ఓ వ్యక్తి వయసును రుజువు చేయడానికి ఆధార్ కార్డు తగిన ధ్రువీకరణ పత్రం కాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. రోడ్డు ప్రమాద బాధితుని వయసును నిర్ధారించడానికి ఆధార్ కార్డు తగిన పత్రం అని పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ (ఎస్‌ఎల్‌సీ)లో పేర్కొన్న పుట్టిన తేదీ ఆధారంగానే వయసును నిర్ణయించాలని స్పష్టం చేసింది. ఆధార్ కార్డు వ్యక్తి పుట్టిన తేదీని రుజువు చేసే పత్రం కాదని ఉడాయ్ గతంలో ఓ సర్క్యులర్‌ను జారీ చేసినట్లు తెలిపింది. రోహతక్‌లోని మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ ఓ కేసులో తీర్పు ఇస్తూ.. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి వయసు (47)ను ఎస్‌ఎల్‌సీ సర్టిఫికెట్ ఆధారంగా లెక్కించి, రూ.19.35 లక్షలు నష్టపరిహారాన్ని ప్రకటించింది. అయితే హైకోర్టు ఆధార్ కార్డులోని వయసు (45) ఆధారంగా ఆ నష్టపరిహారాన్ని రూ.9.22 లక్షలకు తగ్గించింది.

ఏఐ చాట్‌బాట్‌తో ప్రేమ.. బాలుడి ఆత్మహత్య



న్యూఢిల్లీ: ఏఐ చాట్‌బాట్‌తో ప్రేమలో పడిన 14 ఏళ్ల పిల్లాడు ఆత్మహత్య చేసుకోవడంతో అతడి తల్లి కోర్టుకెక్కింది. చాట్‌బాట్ 'డేనెరిస్ టార్గారియన్'తో సంభాషణ తర్వాత తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించిన ఆమె ఆ క్యారెక్టర్ సృష్టికర్త అయిన కంపెనీతో పాటు గూగుల్‌పైనా దావా వేశారు. 'గేమ్ ఆఫ్ థ్రోన్స్' సిరీస్‌లోని క్యారెక్టర్ అయిన టార్గారియన్ పేరుతో సృష్టించిన ఈ చాట్‌బాట్‌కు పిల్లాడు సెవెల్ సెట్జెర్ బానిసయ్యాడు. దానితో మాట్లాడిన తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరిలో తన పెంపుడు తండ్రి హ్యాండ్‌గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కుమారుడి ఆత్మహత్యకు చాట్‌బాట్ కారణమని..దాని సృష్టికర్త కంపెనీతోపాటు గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్‌పై ఫ్లోరిడా ఫెడరల్ కోర్టులో అతడి తల్లి దావా వేశారు. చాట్‌బాట్ తన కుమారుడిని మానవరూప, హైపర్ సెక్యువలైజ్డ్, భయపెట్టే వాస్తవిక అనుభవాలతో లక్ష్యంగా చేసుకుందని మేగాన్ తన దావాలో ఆరోపించారు. ఈ కేసుపై గూగుల్ అధికార ప్రతినిధి మాట్లాడుతూ క్యారెక్టర్ ఏఐ ఉత్పత్తుల అభివృద్ధిలో తమ ప్రమేయం లేదని స్పష్టం చేశారు.

కేవలం క్యాన్సర్ కణాలపై దాడి చేసే ఔషధం!



న్యూయార్క్, అక్టోబర్ 24: ఆరోగ్యకర కణాలకు నష్టం కలగకుండా కేవలం క్యాన్సర్ కణాలపై దాడి చేసే ఔషధాన్ని న్యూయార్క్ యూనివర్సిటీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. సహజ జీవ సంబంధమైన వ్యవస్థల నుంచి ఈ మందును తయారుచేశారు. ఇది హర్ 2(మానవ బాహ్య చర్మ పెరుగుదల కారక గ్రాహకం 2)గా పిలిచే ముటెంట్ క్యాన్సర్ ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకుంటుంది. దగ్గరలో ఉన్న ఆరోగ్యకర కణాలకు ఎలాంటి హాని చేయకుండా క్యాన్సర్ కణాలపై ఈ ఔషధం దాడి చేస్తుంది. అయితే ఈ ఔషధం అభివృద్ధి ప్రారంభ దశలోనే ఉందని, హర్2 మ్యుటేషన్లతో తక్కువ సైడ్ ఎఫెక్ట్‌లతో క్యాన్సర్ రోగులకు చికిత్స చేసే కొత్త పద్ధతులకు ఇది దారి తీస్తుందని పరిశోధకులు తెలిపారు. పరిశోధకులు అభివృద్ధి చేసిన కొత్త ప్రొటీన్-ఇంజినీరింగ్ సాంకేతికత కేవలం ముటెంట్ హర్2 లను గుర్తించే యాంటీబాడీలను మాత్రమే అభివృద్ధి చేస్తుంది. ఎలుకల్లో చేసిన ఈ పరిశోధన విజయవంతమైందని.. మనుషుల్లో వచ్చే ఫలితాలపై మరింత పరిశోధన జరగాల్సి ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

నిద్రలేమితో మెదడుకు వేగంగా ముసలితనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: మధ్యవయసులో గాఢ నిద్రలేకపోతే.. ఆ వ్యక్తి మెదడు త్వరగా ముసలితనం బారినపడుతుందని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. 50 ఏండ్లు వచ్చేసరికి ఆ వ్యక్తి మెదడు వేగంగా ముసలితనం పొందే అవకాశముందని తెలిపింది. వీలైనంత తొందరగా నిద్రలేమి సమస్యను పరిష్కరించుకోవాలని అధ్యయనంలోని నిపుణులు సూచించారు. యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు చేసిన పరిశోధనపై 'న్యూరాలజీ' జర్నల్ వార్తా కథనం వెలువరించింది. దీని ప్రకారం, 40 ఏండ్లున్న 589 మందిపై పరిశోధకులు అధ్యయనం చేశారు. పరిశోధన మొదలైన తొలి ఏడాది, 5 ఏండ్ల తర్వాత, 15 ఏండ్లకు వారి మెదళ్లను స్కానింగ్ చేసి పరిశీలించారు. 15 ఏండ్లలో మెదడు కుంచించుకుపోయిన విధానాన్ని బట్టి.. మెదడు వయసును నిర్ధారించారు. నిద్రరీతుల్ని బట్టి వివిధ గ్రూపులుగా విడగొట్టగా, హైరిస్క్ గ్రూప్‌లో ఉన్నవారి మెదడు వయసు 2.6 ఏండ్లు ఎక్కువగా ఉందని పరిశోధనలో తేలింది.

తెలంగాణ, కర్ణాటక సరిహద్దులు మూసేయండి!

- 'మహారాష్ట్ర' ఎన్నికల కోసం ఈ రెండు రాష్ట్రాల నుంచి వందల కోట్లు బట్వాడా
- ట్రక్కుల్లో నోట్ల కట్టల్ని తేనున్న కాంగ్రెస్
- అందుకే, అబ్జర్వర్లుగా ఆ రాష్ట్ర నేతలు
- శివసేన (షిండే) నేత కిరణ్ పావస్కర్
- ఈసీకి ఫిర్యాదు చేసినట్టు వెల్లడి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం తెలంగాణ, కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నోట్ల కట్టల్ని తరలించనున్నదా? గత లోక్‌సభ ఎన్నికల్లోనూ ఇదే పని చేసిందా? శివసేన (షిండే వర్గం) కార్యదర్శి, పార్టీ ప్రతినిధి కిరణ్ పావస్కర్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఇవే అనుమానాలను కలిగిస్తున్నాయి. మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా తెలంగాణ, కర్ణాటక సరిహద్దులను మూసేయాలంటూ ఆయన ఏకంగా ఎన్నికల సంఘానికి (ఈసీ) ఫిర్యాదు చేయడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశమైంది.

కిరణ్ పావస్కర్ ఏమన్నారంటే?

మరికొద్దిరోజుల్లో మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో బుధవారం ముంబైలోని బాలాసాహెబ్ భవన్‌లో కిరణ్ పావస్కర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మహారాష్ట్ర అసెంబ్లీకి త్వరలో జరుగనున్న ఎన్నికల కోసం తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి రూ. కోట్లు మూటల్లో రానున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలే ఈ నోట్ల కట్టలను ట్రక్కుల్లో తరలించనున్నాయి. ఇందులో భాగంగానే ఈ ఎన్నికలకు పార్టీ అబ్జర్వర్లుగా తెలంగాణ, కర్ణాటకకు చెందిన కీలక నాయకులను కాంగ్రెస్ పార్టీ నియమించింది. వాళ్లే ఆ డబ్బును మహారాష్ట్రకు తరలించనున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లోనూ మహా వికాస్ అఘాడీకి ఇలాగే ఈ రెండు రాష్ట్రాల నుంచి పెద్దయెత్తున డబ్బు వచ్చి చేరింది' అని కిరణ్

పావస్కర్ ఆరోపించారు. 'అక్రమ మూటలు మహారాష్ట్రకు చేరకుండా ఉండాలంటే మహారాష్ట్రతో హద్దులను పంచుకొన్న తెలంగాణ, కర్ణాటక సరిహద్దులను మూసేయాలి. ఈ మేరకు ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేశాం' అని కిరణ్ పావస్కర్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఒక్క తెలంగాణ, కర్ణాటక నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా మహారాష్ట్ర కాంగ్రెస్‌కు డబ్బుల మూటలు అందనున్నాయని ఆయన ఆరోపించారు.

తెలంగాణలో పెద్ద ప్రాజెక్టులు అందుకేనా?

ప్రస్తుతం ఆర్థికపరంగా చూస్తే కర్ణాటక కన్నా తెలంగాణయే పచ్చగా కళకళలాడుతున్నదని చెప్పవచ్చు. అక్కడ ఉన్న సీఎం తొలిసారిగా ముఖ్యమంత్రి కావడమే కాక, పార్టీకి పూర్తి విధేయుడుగా ఉన్నందున అక్కడి నుంచి భారీ నిధులను ఆ పార్టీ ఆశిస్తున్నది. అందులో భాగంగానే తెలంగాణలో ఇప్పుడు మూసీ నది పునరుద్ధరణ పేరుతో 1.5 లక్షల కోట్ల భారీ ప్రాజెక్టుకు తెరతీసారని ఆరోపణలు వస్తున్నాయి. అలాగే ఇటీవల హైడ్రా పేరుతో రియల్టర్లను బెదిరించడం ప్రారంభమైందని, వారి నుంచి పెద్దమొత్తంలోనే నిధులను సేకరిస్తారని అంటున్నారు.

కాంగ్రెస్ ఏటీఎం తెలంగాణ!

కిరణ్ పావస్కర్ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. అధికారంలోకి వచ్చి ఏడాది దగ్గరపడుతున్నా ఇస్తామన్న ఆరు గ్యారెంటీలను రేవంత్ ప్రభుత్వం నెరవేర్చలేదు. అభివృద్ధి, సంక్షేమం మాటను పక్కనబెట్టింది. రైతుల రుణమాఫీ, రైతు భరోసా, పింఛన్ల పెంపు ఎప్పుడో అటకెక్కాయి. అయినప్పటికీ, కొత్త ప్రభుత్వం రూ. 80 వేల కోట్లకు పైగా అప్పులు చేసింది. దీంతో మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఓ ఏటీఎంగా వాడుకొంటున్నదా? అనే అనుమానాలను నెటిజన్లు వ్యక్తంచేస్తున్నారు. సరిగ్గా హర్యానా ఎన్నికల ముందే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో ఈడీ సోదాలు చేయడం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉన్నట్టుండి జార్ఖండ్‌లో పర్యటించడం ఈ అనుమానాలను మరింతగా బలపరుస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కాగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికల కోసం కర్ణాటకలోని వాల్మీకి కార్పొరేషన్ డబ్బులను కాంగ్రెస్ నేతలు వినియోగించడం, ఆ డబ్బు తెలంగాణకు తరలినట్టు ఈడీ విచారణలో తేలడం గమనార్హం.

నూతన సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా

- నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర
- 11న బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా గురువారం నియమితులయ్యారు. ఆయన నియామకానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ప్రస్తుతం సీజేఐగా ఉన్న డీవై చంద్రచూడ్ నవంబర్ 10న పదవీ విరమణ చేస్తారు. దీంతో నవంబర్ 11న సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేస్తారు. సంజీవ్ ఖన్నా ఈ పదవిలో ఆరు నెలలు మాత్రమే ఉంటారు. ఆయన 2025 మే 13న పదవీ విరమణ చేస్తారు. ప్రస్తుతమున్న సీజేఐ చంద్రచూడ్ 2022 నవంబర్ 8 నుంచి ఈ పదవిలో ఉన్నారు.

పలు కీలక తీర్పుల్లో భాగస్వామి

న్యూఢిల్లీలో 1960, మే 14న జన్మించిన సంజీవ్ ఖన్నా ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రాన్ని చదివారు. ఢిల్లీ హైకోర్టులో 2005లో అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2006లో శాశ్వత జడ్జి అయ్యారు. 2019, జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన పలు ప్రముఖ తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల వినియోగాన్ని ఆయన సమర్థిస్తూ.. అవి పూర్తి భద్రమైనవని, దాని వల్ల బోగస్ ఓట్లు, బూత్‌ల రిగ్గింగ్‌ను అరికట్టవచ్చునని పేర్కొన్నారు. అలాగే ఎలక్టోరల్ బాండ్లపై సంచలన తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో ఖన్నా కూడా ఉన్నారు. 370 అధికరణ రద్దును సమర్థిస్తూ తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో కూడా ఆయన సభ్యుడే.

గ్రామ పంచాయతీ స్థాయిలోనే వాతావరణ సమాచారం

న్యూఢిల్లీ: విపత్తు నిర్వహణ సన్నద్ధతను మరింత పటిష్టపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమైంది. రోజువారీ వాతావరణ సమాచారాన్ని గ్రామ పంచాయతీ స్థాయిలోనే అందజేసే సేవలను కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ (లలన్ సింగ్) గురువారం ప్రారంభించారు. భారత వాతావరణ శాఖ విస్తరించిన సెన్సర్ కవరేజ్ సహకారంతో ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇటువంటి సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం ఇదే తొలిసారి. ఈ మంత్రిత్వ శాఖకు చెందిన ఈ-గ్రామ్‌స్వరాజ్, మేరీపంచాయత్ యాప్, గ్రామ్ మన్‌చిత్ర డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా వాతావరణ సూచనలను పంపిస్తారు. తుపానులు, భారీ వర్షాలు వంటివి సంభవించే అవకాశం ఉన్నపుడు పంటలు, ఆస్తులు, ప్రజల ప్రాణాలను కాపాడటం కోసం ఎస్ఎంఎస్ అలర్ట్‌లను పంచాయతీ ప్రతినిధులకు పంపిస్తారు.

ఖర్గేకు అవమానం!

ప్రియాంక నామినేషన్ వేళ గది బయటే

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: వయనాడ్‌లో కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ నామినేషన్ కార్యక్రమంలో ఆ పార్టీ చీఫ్, దళిత నేత మల్లికార్జున ఖర్గేకు తీవ్ర అవమానం జరిగిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. నకిలీ గాంధీ కుటుంబంతో జత కట్టిన ఖర్గే ఆఖరికి పార్టీ అధ్యక్షుడైనప్పటికీ లైన్‌లో వేచి ఉండాల్సిన దుస్థితి వచ్చిందని అన్నారు. దళితుడైనందునే గాంధీ కుటుంబం ఆయనను నామినేషన్ కార్యక్రమంలో దూరంగా ఉంచి అవమానించిందని పేర్కొంటూ ఈ సందర్భంగా ప్రియాంక గాంధీ నామినేషన్ వేస్తుండగా, ఖర్గే గది బయట వేచి చూస్తున్న వీడియోను విడుదల చేశారు. బీజేపీ జాతీయ ప్రతినిధి గౌరవ్ భాటియా గురువారం మీడియాతో మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా దళిత నేత మల్లికార్జున ఖర్గేను ఆ పార్టీ అవమానించిందని అన్నారు. సీతారాం కేసరి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు కూడా ఇలాగే జరిగిందని అన్నారు. దళితులు, వెనుకబడిన తరగతుల వారిని అవమానించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని పేర్కొన్నారు. నామినేషన్ సందర్భంగా ప్రియాంక తన అఫిడవిట్‌లో తన భర్త రాబర్ట్ వాద్రా నికర ఆస్తుల విలువను ఆదాయపు పన్ను శాఖ పేర్కొన్న మొత్తం కన్నా తక్కువ చూపారని ఆరోపించారు. ఖర్గేకు అవమానం జరిగిందని వస్తున్న వార్తలను కాంగ్రెస్ తోసిపుచ్చింది. నామినేషన్ సమర్పించే గదిలో ఐదుగురు మాత్రమే ఉండాలని జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు ఖర్గే గది బయట ఉన్నారని తెలిపింది.

సైనిక వాహనంపై ఉగ్రదాడి

ఇద్దరు సైనికులు, ఇద్దరు పోర్టర్లు మృతి • జమ్ముకశ్మీర్‌లో ముష్కరుల ఘాతుకం

శ్రీనగర్: జమ్ముకశ్మీరులో మళ్లీ ఉగ్రవాదులు పేట్రేగిపోయారు. బారాముల్లా జిల్లాలోని గుల్మార్గ్ సమీపంలో గురువారం సైనిక వాహనంపై దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు, ఇద్దరు పోర్టర్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ముష్కరులు పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్‌కు చెందిన సభ్యులుగా భావిస్తున్నారు. ఆర్మీ వెహికిల్ బోట్‌పర్తి సమీపానికి చేరుకోగానే ఉగ్రవాదులు కాల్పులు జరిపినట్టు సైనిక అధికారులు తెలిపారు. దీంతో జవాన్లు ఎదురుకాల్పులు జరిపినట్టు వెల్లడించారు. మూడు రోజుల క్రితం జరిగిన ఉగ్రదాడిలో ఆరుగురు భవన నిర్మాణ కార్మికులు, ఓ డాక్టర్ మరణించారు.

ఏపీ, బీహార్‌కు రెండు రైలు ప్రాజెక్టులు

కేంద్రంలో మద్దతునిస్తున్న మిత్ర పార్టీలకు బీజేపీ నజరానా

న్యూఢిల్లీ: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిలబడటానికి ఊతమిస్తున్న ఏపీ, బీహార్‌ల రుణాన్ని మోదీ క్యాబినెట్ తీర్చుకుంటున్నది. ఆ రెండు రాష్ట్రాల కోసం ప్రత్యేకంగా రూ.6,798 కోట్ల అంచనా విలువతో రెండు రైలు ప్రాజెక్టులను గురువారం మంజూరుచేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఈ మేరకు ఆమోదం తెలిపింది. 256 కిలోమీటర్ల పొడవైన నర్కటియాగంజ్-రక్సౌల్ – సీతామర్హి – దర్భంగా – సీతామర్హి – ముజఫర్‌పూర్ సెక్షన్‌లో డబ్లింగ్ పనులకు, అమరావతి మీదుగా ఎర్రుపాలెం నుంచి నంబూరు వరకు 57 కి.మీ. రైలు మార్గానికి క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టులతో తెలుగుదేశం అధికారంలో ఉన్న ఏపీకి, జేడీయూ అధికారంలో ఉన్న బీహార్‌కు లబ్ధి చేకూరనుంది. టీడీపీ, జేడీయూ పార్టీలు కేంద్రంలో బీజేపీ సర్కారుకు కీలక మద్దతునిస్తున్న సంగతి తెలిసిందే. ఏపీకి మంజూరైన కొత్త రైలు మార్గం ఎన్టీఆర్ విజయవాడ, గుంటూరు జిల్లాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం జిల్లా నుంచి వెళ్లనుంది.

ట్రూడో.. దిగిపో!

- కెనడా ప్రధానికి స్వపక్షం నుంచే తీవ్ర వ్యతిరేకత
- పదవి నుంచి వైదొలగాలని ఎంపీల డిమాండ్
- నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల 28 డెడ్‌లైన్

టొరంటో, అక్టోబర్ 24: తన దురుసు వ్యాఖ్యలు, అసంబద్ధ ఆరోపణలతో కయ్యానికి కాలుదువ్వుతూ భారత్‌తో దౌత్య సంబంధాలు తెంచుకోవడానికి ప్రయత్నిస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు ఆ దేశంలో పరిస్థితులు ఏమంత అనుకూలంగా లేవు. వాటి నుంచి దారి మళ్లించడానికే ఆయన భారత్‌తో ఘర్షణ వైఖరిని అవలంబిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సొంత లిబరల్ పార్టీకి చెందిన పలువురు నేతలు ట్రూడో వైఖరి పట్ల తీవ్ర అసంతృప్తితో ఉండటమే కాక, అతడిని పదవి నుంచి దిగిపోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. తొమ్మిదేండ్లుగా ప్రధాని పదవిలో ఉన్న ఆయన దానిలో కొనసాగడానికి తన నిబద్ధతను పునరాలోచించాలని పార్టీలోని పలువురు ఉదారవాదులు పేర్కొంటున్నారు. గత కొంతకాలంగా ట్రూడో ప్రతిష్ట మసకబారుతూ వస్తున్నది. ఆయన సొంత పార్టీ ఎంపీలే ఆయన పట్ల తీవ్ర అసంతృప్తితో ఉండి ఆయనకు వ్యతిరేకంగా మిగతా సభ్యులతో సమావేశమై రహస్య మంతనాలు జరుపుతున్నారు. బుధవారం ట్రూడో నేతృత్వంలో జరిగిన సమావేశంలో 153 మంది సభ్యులున్న పార్టీలో 20 మందికి పైగా సభ్యులు ఆయన వచ్చే ఎన్నికలకు ముందే పదవి నుంచి దిగిపోవాలంటూ డిమాండ్ చేశారు. అక్టోబర్ 28లోపు ట్రూడో తన భవిష్యత్తును ఎంచుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని సుమారు 25 మంది సభ్యులు సంతకం చేసిన లేఖలో హెచ్చరించారు. దీంతో ఇప్పటికే మైనారిటీలో ఉన్న ఆ ప్రభుత్వానికి చిక్కులు తప్పేటట్టు లేదు. అయితే సమావేశం అనంతరం బయటకు వచ్చిన ట్రూడో తమ పార్టీ సభ్యులంతా ఐక్యంగా ఉన్నట్టు ప్రకటించారు.

ట్రూడో నాయకత్వంలో ఎన్నికలకు వెళ్తే ఓటమే!

నాలుగో పర్యాయం జస్టిన్ ట్రూడో ప్రధాని పదవిలో కొనసాగడానికి పలువురు పార్టీ నేతలు ఇష్టపడటం లేదు. ఆయన నేతృత్వంలో పార్టీ ఎన్నికలకు వెళితే తీవ్ర పరిణామాలు తప్పవని వారు అంటున్నారు. ఇటీవల తమ పార్టీకి మంచి పట్టున్న టొరంటో, మాంట్రియల్‌లో జరిగిన ప్రత్యేక ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలు కావడంతో ట్రూడో నాయకత్వంపై పార్టీలో సందేహాలు మరింత అధికమయ్యాయి. ప్రస్తుతం పార్లమెంట్‌లో పూర్తి మెజారిటీ లేని లిబరల్ పార్టీ 2025లో జరిగే ఫెడరల్ ఎన్నికల్లో కనీసం ఒక పెద్ద పార్టీ మద్దతు అయినా కోరుకుంటున్నది. కొవిడ్-19 తర్వాత దేశంలో జీవన వ్యయం పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల నానోస్ పోల్ జరిపిన సర్వేలో అధికార లిబరల్ పార్టీ విపక్ష కన్జర్వేటివ్‌ల కన్నా 38 నుంచి 25 శాతం వెనుకబడి ఉంది. దీంతో ట్రూడో నేతృత్వంలో వచ్చే ఎన్నికలకు వెళితే ఆ పార్టీకి ఘోర పరాజయం తప్పదని పార్టీ నేతలు భయపడుతున్నారు.

వలసలపై కెనడా భారీగా కోత

మరోసారి అధికారంలోకి రావాలన్న లక్ష్యం కోసం కెనడాలోని జస్టిన్ ట్రూడో సర్కార్ వలసదారులను టార్గెట్ చేసుకుంది. రాబోయే సంవత్సరం నుంచి వలసలను పెద్ద ఎత్తున నియంత్రించేందుకు సరికొత్త వలస విధానాన్ని తీసుకొస్తున్నట్టు తెలిపింది. కెనడాలో ఆశ్రయం కల్పిస్తున్న తాత్కాలిక నివాసితులు, శాశ్వత నివాసితుల సంఖ్యను తగ్గించబోతున్నట్టు కెనడా తెలిపింది. ఈ ఏడాది కెనడాలో మొత్తం 4,85,000 మందికి శాశ్వత నివాస హోదా కల్పించగా, దీనిని 2025లో 3,95,000కు, 2027నాటికి 3,65,000కు తగ్గించబోతున్నట్టు ట్రూడో సర్కార్ వెల్లడించింది.

వాహనాలను మధ్యలోనే వదిలేసి..

నడుచుకుంటూ ఇండ్లకు.. బెంగళూరు ప్రజలకు ట్రాఫిక్ చిక్కులు

బెంగళూరు: భారీ వర్షాలు, ట్రాఫిక్ జామ్‌లు బెంగళూరు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. బుధవారం సాయంత్రం పలు ప్రాంతాల్లో భారీ వర్షం, నీళ్లు నిలిచిపోవడం వల్ల ట్రాఫిక్ పోలీసులు ఎలక్ట్రానిక్ సిటీ ఫ్లై ఓవర్‌ను ఒకవైపు మూసేశారు. దీంతో రెండు గంటల పాటు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో నిరీక్షించలేక కొందరు వాహనాలను అక్కడే విడిచిపెట్టి ఇండ్లకు నడుచుకుంటూ వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను చాలామంది ట్రాఫిక్.ఇన్‌లో పంచుకున్నారు. 'పూర్తిగా గందరగోళంగా ఉంది! ఈ పరిస్థితుల్లో ఏదైనా వైద్య అత్యవసర పరిస్థితి ఎదురైతే బతకడానికి అవకాశమే ఉండదు. ఎలక్ట్రానిక్ సిటీ ఫ్లై ఓవర్ దాదాపుగా జామ్ అయింది' అని ఎక్స్‌లో ఓ యూజర్ ఆవేదన వ్యక్తం చేశారు.

జర్మనీ 'ఫోకస్ ఇండియా' వ్యూహం

నేడు ప్రధానితో జర్మనీ మంత్రుల భేటీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ఏడో ఇండో-జర్మన్ ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా జర్మనీకి చెందిన ఎనిమిది మంది మంత్రుల బృందం శుక్రవారం ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ కానున్నది. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు-2030 ఎజెండాలో భాగంగా ఈ సమావేశం జరుగనున్నట్టు సంబంధితవర్గాలు పేర్కొన్నాయి. 'ఫోకస్ ఇండియా' వ్యూహం పేరిట జరుగనున్న ఈ భేటీలో వాతావరణం, జీవ వైవిధ్యం పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా చర్చించనున్నట్టు తెలుస్తున్నది. వీటితోపాటు జర్మనీ-భారత్ మధ్య వాణిజ్య సంబంధాల బలోపేతం, పరిశోధనలు, నైపుణ్య రంగాల్లో చేయూత, భద్రతా పరమైన స